

కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన చేస్తున్న మంత్రి సీతక్క

కమ్యూనిటీ హాల్‌కు మంత్రి సీతక్క శంకుస్థాపన

- వినతిపత్రం అందజేసిన రిటైర్డ్ ఉద్యోగులు
- శివరాత్రి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

ములుగు రూరల్, ఫిబ్రవరి 29 : ములుగు జిల్లా కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కమ్యూనిటీ హాల్ పనులకు గురువారం మంత్రి సీతక్క శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఉద్యోగులు పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని మంత్రికి అందజేశారు. గత ప్రభుత్వం విశ్రాంత ఉద్యోగులకు వారి మూల పెన్షన్ నుంచి 1 శాతం సొమ్ము మినహాయించి పూర్తి స్థాయిలో వైద్య సదుపాయాలు కల్పించేందుకు మొదటి పీఆర్‌సీ సూచించిన విధంగా జీవోను విడుదల చేసిందని గుర్తు చేశారు. ట్రస్ట్ సీఈవో, సభ్యులను నియమించనందున అది అమలుకు నోచుకోలేదని, సత్వరమే ఈహెచ్ఎస్ ట్రస్ట్ సీఈవోను నియమించి అమలు చేయాలన్నారు. దీంతో పాటు పలు అంశాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, కోశాధికారి గంగారెడ్డి, సంఘం సభ్యులు పాల్గొన్నారు.కాగా, ములుగు మండలం అంకన్నగూడెంలో ఈ నెల 6 నుంచి 9 వరకు జరిగే బాలకుమారస్వామి జాతర ఆహ్వాన పత్రికను గురువారం మంత్రి సీతక్కకు డీఎంహెచ్‌వో అల్లెం అప్పయ్య, పూజారులు అందజేశారు. వారి వెంట పూజారుల సంఘం సభ్యులు కొట్టెం సారయ్య, రాజు ఉన్నారు. అలాగే ములుగు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో రూపొందించిన ప్రవేశాల వాల్‌పోస్టర్‌ను మంత్రి సీతక్క ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కొప్పుల మల్లేశం, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు. ఆదివాసీ గిరిజన నిరుద్యోగుల కోసం రాష్ట్రంలో ప్రత్యేక డీఎస్సీని ప్రకటించాలని మంత్రి సీతక్కకు గురువారం ఆదివాసీ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు వజ్జ రాజు ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశోక్, వర్కింగ్ ప్రెసిడెంట్ రమేశ్, సభ్యులు చందు, మంకిడి రవి, శ్రీరాములు, నర్సింహారావు తదితరులున్నారు.

శివరాత్రి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

వెంకటాపూర్ : మండలంలోని రామప్ప దేవాలయంలో మార్చి 8న జరిగే మహాశివరాత్రి ఉత్సవాల వాల్ పోస్టర్‌ను మంత్రి సీతక్క గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో బిల్లా శ్రీనివాస్, ముఖ్య అర్చకులు హరిశ్శర్మ మంత్రికి స్వామి వారి ప్రసాదం అందజేసి మహాశివరాత్రి వేడుకల్లో పాల్గొనాలని ఆహ్వానించారు. అలాగే కలెక్టర్ ఇలా త్రిపాఠిని వేడుకలకు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది అవినాష్‌రెడ్డి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

గేట్లు తొలగించేదెన్నడు?

- ఠాణా ముందు 23 ఏళ్ల క్రితం ఏర్పాటు
- పోలీస్ స్టేషన్ పేల్చివేతతో చర్యలు
- రాకపోకలు నిలిపివేతతో ఇబ్బందులు
- ప్రమాదాల బారిన పడుతున్న ప్రజలు

పోలీసు స్టేషన్ ఎదుటి నుంచి రాకపోకలను నిలిపివేస్తూ పైపులతో ఏర్పాటు చేసిన గేటు

ఏటూరునాగారం, ఫిబ్రవరి 29 : ఏటూరునాగారం పోలీస్ స్టేషన్‌ను అప్పటి పీపుల్స్ వార్ నక్సల్స్ పేల్చివేసినప్పటి నుంచి ఠాణాకు ఇరువైపులా ఇనుప పైపులతో గేట్లు ఏర్పాటు చేశారు. 23 ఏళ్లుగా ఈ దారిపై రాకపోకలు నిలిపివేయడంతో ఐటీడీఏ పీవో క్యాంపు కార్యాలయం చుట్టూ ఉన్న నాలుగు మలుపులు తిరిగి వాహనదారులు వెళ్లాల్సి వస్తున్నది. దీంతో వాహనాలు మూల మలుపు వద్ద కింద పడడం, ఢీకొనడం లాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయి.163 జాతీయ రహదారి ఈ పోలీస్ స్టేషన్ ముందు నుంచే ఉంది. 2001 జులై 30న పీపుల్స్ వార్ నక్సల్స్ ట్రాక్టర్ల ద్వారా డైరెక్షనల్ మైన్స్‌ను ఉపయోగించి ఏటూరునాగారం పోలీస్ స్టేషన్‌ను పేల్చి వేశారు. ఈ ఘటనలో పోలీసులు, ఫారెస్టు గార్డ్, పురోహితుడు మృతి చెందారు. అప్పుడు నక్సల్స్ ప్రభావం అధికంగా ఉండడంతో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీస్ స్టేషన్ ముందు రాకపోకలు నిలిపివేశారు. ప్రస్తుతం మావోయిస్టుల ప్రభావం ఏజెన్సీలో తగ్గినట్లు పోలీసులు ప్రకటిస్తున్నారు. ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని గోదావరి తీర ఇవతలి ప్రాంతం, ఒకప్పుడు పీపుల్స్‌వార్‌కు కంచుకోటగా ఉన్న అత్యంత మారుమూల గ్రామమైన తుపాకులగూడెంలో పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేశారు. కానీ ఏటూరునాగారం పోలీస్ స్టేషన్ ఎదుట ఉన్న గేట్లను మాత్రం ఎత్తివేయడం లేదు. ఏటూరునాగారం నుంచి హన్మకొండ వరకు ఉన్న ఏ పోలీస్ స్టేషన్ ముందు ఇలాంటి గేట్లు అడ్డుగా పెట్ట లేదు. ప్రభుత్వం, పోలీసులు మాత్రం దీని తొలగింపునకు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. ఇదే గేట్‌కు గురువారం పాలకుర్తి వెంకటేశ్వర్లు ఢీ కొనడంతో మృతి చెందాడు. ఏటూరునాగారం పోలీస్ స్టేషన్‌కు రక్షణగా పెట్టిన గేట్‌ను ఎత్తివేయాలని తాము కలెక్టర్, ఎస్పీ దృష్టికి తీసుకపోయామని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సునీల్‌కుమార్ తెలిపారు. వెంటనే పోలీసు ఉన్నతాధికారులు స్పందించి అడ్డుగా పెట్టిన గేట్‌ను తొలగించాలని ఆయన కోరారు.

గేట్‌ను ఢీకొని ఒకరు మృతి

పాలకుర్తి వెంకటేశ్వర్లు(ఫైల్)

ఏటూరునాగారం, ఫిబ్రవరి 29 : మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ రోడ్డు వైపు రాకపోకలు సాగించకుండా అడ్డుగా పెట్టిన గేట్‌ను ఢీకొని ఒకరు మృతి చెందిన ఘటన గురువారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. షాపల్లి గ్రామానికి చెందిన పాలకుర్తి వెంకటేశ్వర్లు (50) ఏటూరునాగారం వై జంక్షన్ సెంటర్‌లో భోజన హోటల్ నడుపుకుంటున్నాడు. కాగా, హోటల్‌కు అవసరమైన కూరగాయల కోసం ద్విచక్ర వాహనంపై మార్కెట్‌కు వెళ్లిన వెంకటేశ్వర్లు తిరిగి వస్తున్న క్రమంలో గేట్‌ను వేగంగా ఢీ కొట్టాడు. దీంతో ఆయన తలకు, కడుపులో బలమైన గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఎస్సై కృష్ణ ప్రసాద్ హుటాహుటిన అక్కడకు చేరుకొని విషయం తెలుసుకున్నారు. వెంటనే స్పందించిన ఆయన అటుగా వస్తున్న ట్రాక్టర్‌ను ఆపి వెంకటేశ్వర్లును ఒక వైపు తను, మరో వైపు కానిస్టేబుల్ సుధాకర్, మరో ఇద్దరితో కలిసి ట్రాక్టర్ ట్రాలీలోకి ఎక్కించి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం ఎస్సై వైద్యశాలకు చేరుకుని పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకోగా, మృతి చెందినట్లు వారు ధ్రువీకరించారు. మృతుడికి భార్య జ్యోతి, ఇద్దరు పిల్లలున్నారు.

పెండింగ్ దరఖాస్తులు పరిష్కరించాలి

భూపాలపల్లి కలెక్టర్ భవేశ్ మిశ్రా

గణపురం : గాంధీనగర్‌లో గ్రిడ్ పనితీరును పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా

భూపాలపల్లి రూరల్, ఫిబ్రవరి 29 : ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని భూపాలపల్లి కలెక్టర్ భవేశ్ మిశ్రా తహసీల్దార్లను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో ధరణి, మ్యుటేషన్, ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మ్యుటేషన్ ప్రక్రియలో జాగ్రత్తగా వ్యవహరించాలని, క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టాలన్నారు. విచారణ ప్రక్రియలో అభ్యంతరాలు తెలిపిన వ్యక్తులకు నోటీసులు జారీ చేయాలన్నారు. ప్రత్యేక డ్రైవ్ చేపట్టి ధరణి దరఖాస్తులను ఈ నెల 9 వరకు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, తహసీల్దార్లు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు సురక్షిత నీరందించాలి

గణపురం : నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ ప్రజలకు సురక్షిత తాగునీరందించాలని భూపాలపల్లి కలెక్టర్ భవేశ్ మిశ్రా మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. గురువారం మండలంలోని గాంధీనగర్‌లో నిర్మించిన వాటర్ గ్రిడ్ పంపుహౌస్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా పంపుహౌస్‌లోని నీటి సామర్థ్యం, పంపింగ్, శుద్ధీకరణ ప్రక్రియ తదితర వివరరాలను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. వేసవిలో నీటి ఎద్దడి నివారణకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని, ఇందుకు కావాల్సిన మౌలిక, ఆర్థిక పరమైన అంశాలను ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మాణిక్యరావు, ఈఈ నిర్మల, గ్రిడ్ ఇంజినీరింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు. కాగా, మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ ఆశ్రమ పాఠశాలను కలెక్టర్ తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులకు భౌతిక, గణిత శాస్త్రం, ఇంగ్లిష్ సబ్జెక్టుల్లో పాఠాలు బోధించారు.

కార్యకర్తలకు అండగా ఉంటా

మహబూబాబాద్ ఎంపీ కవిత

నాయకులతో ఎంపి కవిత

వెంకటాపురం (నూగూరు), ఫిబ్రవరి 29 : బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులకు అండగా ఉంటానని మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవిత అన్నారు. గురువారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గూడవర్తి నర్సింహమూర్తి స్వగృహంలో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీఆర్ఎస్ తోనే రాష్ట్రానికి మేలు జరుగుతుందని, తెలంగాణ ప్రయోజనాల కోసం పార్టీ నిరంతరం పోరాడుతుందన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గంపా రాంబాబు, మండల కార్యదర్శి పిల్లారిసెట్టి మురళి, అధికారప్రతినిధి డర్రా దామోదర్, ముడుంబా శ్రీను, అట్టం సత్యనారాయణ, పూనెం శ్రీదేవి, పూజరి ఆదిలక్ష్మి, కుంజ గంగ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ బడ్జెట్ రూ. 27.21కోట్లు

- ఆమోదించిన కౌన్సిల్ సభ్యులు
- హాజరైన ఎమ్మెల్యే సత్యనారాయణ
- అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచన

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

కృష్ణకాలనీ, ఫిబ్రవరి 29 : వచ్చే ఆర్థిక సంవత్సరానికి భూపాలపల్లి మున్సిపాలిటీకి రూ. 27.21 కోట్లతో చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణి బడ్జెట్‌ను ప్రవేశపెట్టగా కౌన్సిల్ ఆమోదించింది. మున్సిపాలిటీ కౌన్సిల్ హాల్‌లో గురువారం చైర్‌పర్సన్ అధ్యక్షతన బడ్జెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి బీఆర్ఎస్ కౌన్సిలర్లు హాజరు కాలేదు. గత ఏడాదితో పోలిస్తే ఈ సారి బడ్జెట్ రూ. 1.41 లక్షలు ఎక్కువగా ఉంది. గత ఏడాది పన్నుల రాబడి రూ.4.63 కోట్లుండగా, ఈసారి రూ. 4.71 కోట్లకుపెంచారు. ట్రేడ్ లైసెన్స్‌లు, ఆస్తి, నీటి పన్నుల ద్వారా వచ్చే ఆదాయానికి భారీగా గండి పడింది. దీంతో పన్నుల రాబడిపై ఈ బడ్జెట్‌లో ప్రత్యేక దృష్టి సారించారు. వివిధ గ్రాంటులు, పన్నేతర రాబడిని ఈసారి రూ. 4.50 కోట్లుగా చూపించారు. పారిశుధ్య సిబ్బంది వేతనాల కోసం నెలకు రూ. 35 లక్షలు వెచ్చించాల్సి ఉంటుందని, మున్సిపాలిటీ వాహనాలకు డీజిల్ ఖర్చు నెలకు రూ. 4 లక్షలు కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మాట్లాడుతూ మున్సిపాలిటీ ఆదాయాన్ని పెంచేందుకు ఆయా వార్డుల అధికారులు, కౌన్సిలర్లు సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రధానంగా ఆస్తి, నీటి పన్ను, ట్రేడ్ లైసెన్స్‌ల ద్వారా కోట్లల్లో ఆదాయం వస్తుందని, సింగరేణితో పాటు ఇతర ప్రభుత్వ శాఖల నుంచి రావాల్సిన బకాయిలను వసూలు చేయాలన్నారు. మార్చి నెలాఖరు వరకు వంద శాతం పన్నులు వసూలు చేయాలని సూచించారు. అలాగే వచ్చే వేసవి కాలంలో 100 రోజుల ప్రణాళికను రూపొంది ఆయా వార్డుల్లో నీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే ఆదేశించారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, కమిషనర్ రాజేశ్వర్, మేనేజర్ స్వామి, ఆర్ఐ భాస్కర్, అకౌంటెంట్ అనితా దేవి, టీపీవో సునీల్, ఏఈ మానస, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

తాడిచెర్ల పీఏసీఎస్ చైర్మన్‌పై అవిశ్వాసం

మల్హర్, ఫిబ్రవరి 29 : తాడిచర్ల పీఏసీఎస్ వైర్మన్ చెప్యాల రామారావుపై ఏడుగురు డైరెక్టర్లు అవిశ్వాసాన్ని ప్రకటించి అందుకు సంబంధించిన పత్రాన్ని గురువారం డీసీవో శైలజకు అందజేశారు. మొత్తం 13 మంది డైరెక్టర్లకు బీఆర్ఎస్ నుంచి 7 మంది, కాంగ్రెస్ నుంచి ఆరుగురు ఎంపికకాగా, బీఆర్ఎస్‌కు చెందిన చెప్యాల రామారావు చైర్మన్‌గా కొనసాగుతున్నారు. రెండేళ్ల క్రితం బీఆర్ఎస్ డైరెక్టర్ ఒకరు మృతి చెందాడు. కాంగ్రెస్ నుంచి మరో డైరెక్టర్ బీఆర్ఎస్‌లో చేరడంతో బీఆర్ఎస్‌కు ఏడుగురు, కాంగ్రెస్‌కు ఐదుగురు డైరెక్టర్లున్నారు. అయితే బీఆర్ఎస్‌కు చెందిన ఇద్దరు, కాంగ్రెస్‌కు చెందిన ఐదుగురు డైరెక్టర్లు కలిసి చైర్మన్‌పై ఆవిశ్వాస పత్రాన్ని డీసీవోకు అందజేశారు. కార్యక్రమంలో ఇప్పమొండి, తిరుపతిరావు, స్వరానాయక్, మల్క ప్రకాశ్‌రావు తదితరులున్నారు.

రోడ్డు ప్రమాదంలో పారిశుధ్య కార్మికుడికి గాయాలు

ములుగు రూరల్, ఫిబ్రవరి 29 : రోడ్డు ప్రమాదంలో పారిశుధ్య కార్మికుడికి గాయాలైన ఘటన ములుగు మండలంలోని గట్టమ్మ దేవాలయం సమీపంలో జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన దేవస్వామి అనే కార్మికుడు మేడారం జాతరలో పారిశుధ్య కార్యక్రమాల నిమిత్తం చెత్త బండితో వచ్చాడు. గురువారం తిరుగు వారం ముగియడంతో తిరిగి వరంగల్‌కు వెళ్తున్న క్రమంలో హనుమకొండ వైపు నుంచి వస్తున్న లారీ ఎదురుగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దేవస్వామికి గాయాలు కాగా 108లో ములుగు ప్రభుత్వ దవాఖానకు తరలించగా ప్రథమ చికిత్స అనంతరం ఎంజీఎంకు తరలించారు. ప్రమాద స్థలిని ఎస్సై వెంకటేశ్వర్ పరిశీలించారు.

మహా శివరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయాలి

- అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు
- కాళేశ్వరంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం

కాళేశ్వరం, ఫిబ్రవరి 29 : మహా శివరాత్రి సందర్భంగా కాళేశ్వర, ముక్తీశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 7 నుంచి 9 వరకు నిర్వహించే ఉత్సవాలను విజయవంతం చేయాలని భూపాలపల్లి అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు అధికారులకు సూచించారు. వేములవాడ గెస్ట్ హౌస్‌లో గురువారం వివిధ శాఖల అధికారులతో ఉత్సవాల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ ఉత్సవాలకు దాదాపు రెండు లక్షల మంది వరకు భక్తులు రానున్నారని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి వారికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. మూడు రోజుల ముందుగానే ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ధర్మకర్తలు అడప సమ్మయ్య, ఆరెల్లి సత్యనారాయణ, శ్యాంసుందర్, ఎంపీపీ రాణాబాయి, జడ్పీటీసీ అరుణ, ఎంపీటీసీ మమత తదితరులు పాల్గొన్నారు.

16న జాతీయ లోక్ అదాలత్

కృష్ణకాలనీ, ఫిబ్రవరి 29 : ఈ నెల 9న జరగాల్సిన జాతీయ లోక్ అదాలత్‌ను 16వ తేదీకి వాయిదా వేసినట్లు జిలా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కే జయరాంరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అనివార్య కారణాల వల్ల వివిధ కేసుల్లో చిక్కుకొని సతమతమవుతున్న వారు దీనిని వినియోగించుకోవాలన్నారు. కక్షిదారులు రాజీ మార్గంతో తమ కేసులను పరిష్కరించుకొని ప్రశాంత జీవితాన్ని గడపాలన్నారు. లోక్ అదాలత్‌లో ఇచ్చిన తీర్పులు అంతిమమని, అప్పీల్ కూడా ఉండదన్నారు. ఇంతకుముందు చెల్లించిన కోర్టు ఫీజు కూడా తిరిగి పొందే అవకాశం ఉంటుందని జయరాంరెడ్డి తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో విజయలక్ష్మి

నీటి కొరత లేకుండా చూడాలి

జడ్పీ సీఈవో విజయలక్ష్మి

చిట్యాల, ఫిబ్రవరి : గ్రామాల్లో తాగునీటి కొరత లేకుండా చూడాలని జడ్పీ సీఈవో విజయలక్ష్మి అధికారులకు సూచించారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో మరుగుదొడ్ల బిల్లుల చెల్లింపులు, తాగునీటి సమస్యలపై సమీక్ష నిర్వహించారు. వేసవి సమీపిస్తున్నందున గ్రామాల్లో నీటి ఎద్దడి ఏర్పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. అలాగే తాగునీటి కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. అనంతరం మండల కేంద్రం, ఏలేటిరామయ్యపల్లి, నవాబుపేట నర్సరీలను సందర్శించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామయ్య, ఎంపీవో రామకృష్ణ, ఏపీవో అలీంపాషా, ఆర్‌డబ్ల్యూ ఏఈ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను వడ్డీపై 90 శాతం రాయితీ

కృష్ణకాలనీ, ఫిబ్రవరి 29 : భూపాలపల్లి మున్సిపాలిటీలో ఆస్తి పన్ను వడ్డీపై 90 శాతం రాయితీ ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని కమిషనర్ టీ రాజేశ్వర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు పురపాలక శాఖ ప్రత్యేక కార్యదర్శి యం దానకిషోర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆయన తెలిపారు. వడ్డీ మాఫీ కోసం వన్‌టైం సెటిల్మెంట్ పథకాన్ని అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

భూపాలపల్లి రూరల్ : పరీక్షా కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

ప్రశాంతంగా ఇంటర్ సెకండియర్ పరీక్షలు

భూపాలపల్లి రూరల్/ములుగు రూరల్, ఫిబ్రవరి 29 : ములుగు, భూపాలపల్లి జిల్లాల్లో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. భూపాలల్లి జిల్లాలోని 8 పరీక్షా కేంద్రాల్లో మొత్తం 1,657 మంది విద్యార్థులను కేటాయించగా 1,619 మంది హాజరయ్యారని, 38 మంది గైర్హాజరయ్యారని నోడల్ అధికారి కే దేవరాజం తెలిపారు. జిల్లా కేంద్రంలోని తెలంగాణ మైనారిటీ బాలుర రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల, భూపాలపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రాలను అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు సందర్శించి వసతులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసినట్లు ఆయన తెలిపారు. అలాగే ములుగు జిల్లాలోని 10 పరీక్షా కేంద్రాల్లో 1,934 మంది విద్యార్థులకు 1,874 మంది హాజరయ్యారని, 60 మంది గైర్హాజరయ్యారని నోడల్ అధికారి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు.

బంజారాల అభివృద్ధికి సహకరిస్తా

కృష్ణకాలనీ, ఫిబ్రవరి 29 : జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని బంజారాల అభివృద్ధికి సహకరిస్తానని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని భారత్ ఫంక్షన్ హాల్‌లో గురువారం నిర్వహించిన శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ 285వ జయంతి వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లాలోని బంజారాల కోరిక మేరకు జిల్లా కేంద్రంలో సేవాలాల్ దేవాలయ నిర్మాణానికి భూమిని కేటాయించడంతో పాటు విగ్రహాన్ని కూడా ప్రతిష్ఠిస్తామన్నారు. కార్యక్రమంలో సేవాలాల్ జయంతి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు బానోత్ రాజునాయక్, సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు భూక్యా సురేశ్ నాయక్, ఉత్సవ కమిటీ కోశాధికారి సంతోష్‌నాయక్, కో కన్వీనర్ తిరుపతినాయక్, కాంగ్రెస్ అధికార ప్రతినిధి గాజర్ల అశోక్, ఇస్లావత్ దేవన్, బుర్ర కొమురయ్య, కడారి మాలతి, పద్మావతి, అజ్మీరా సమ్మయ్య, దేశ్‌రాంనాయక్, రాజేందర్‌నాయక్, మహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

భూపాలపల్లి మున్సిపాలిటీలో జరగుతున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. గురువారం 11వ వార్డు వేశాలపల్లిలో రూ. 45 లక్షల నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కౌన్సిలర్లు దాట్ల శ్రీనివాస్, సజ్జనపు స్వామి, ముంజాల రవీందర్, శిరుప అనిల్ తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానంతో అంధుల జీవితాల్లో వెలుగులు

అవగాహన కల్పిస్తున్న అశోక్

ములుగు రూరల్, ఫిబ్రవరి 29 : నేత్రదానం అంధుల జీవితాల్లో వెలుగులు నింపుతుందని నేత్ర, శరీర అవయవ దాతల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ పరికిపండ్ల అశోక్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని గుట్టమ్మ దేవాలయం వద్ద భక్తులకు అవయదానంపై అవగాహన కల్పించారు. చనిపోయిన తర్వాత అవయవాలను కాల్చడం, పాతిపెట్టడం వంటికి చేయకుండా వాటిని దానం చేయాలని ఆయన సూచించారు.

రెండు మండలాలను భద్రాచలం డివిజన్‌లో కలపాలి

వెంకటాపురం (నూగూరు), ఫిబ్రవరి 29 : వాజేడు, వెంకటాపురం మండలాలను భద్రాచలం డివిజన్‌లో కలపాలని గోండ్వానా సంక్షేమ పరిషత్ (జీఎస్పీ) రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణ, రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి అన్నారు. గురువారం మండలంలోని సూరవీడులో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ జిల్లాల విభజన అనంతరం ఈ రెండు మండలాలను పట్టించుకోవడం లేదన్నారు. సమావేశంలో నాయకులు సున్నం సూరిబాబు, నరేశ్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ములుగు, భూపాలపల్లి జిల్లాల్లో సంకల్ప యాత్ర

ములుగు రూరల్/వెంకటాపూర్/కృష్ణకాలనీ, ఫిబ్రవరి 29 : ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో గురువారం బీజేపీ విజయ సంకల్ప యాత్ర నిర్వహించారు. ములుగు మండలం మల్లంపల్లితో పాటు జిల్లా కేంద్రంలో నిర్వహించిన రోడ్‌షోలో సిర్పూర్ కాగజ్‌నగర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం, నాయకులు మోహన్‌రావు, అజ్మీరా ప్రహ్లాద్, కృష్ణవేణినాయక్, కొత్త సురేందర్, నగరపు రమేశ్, జవహర్‌లాల్ తదితరులున్నారు. అనంతరం వెంకటాపూర్ మండలంలోని రామప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి భూపాలపల్లికి వెయ్యి బైక్‌లతో ర్యాలీగా తరలివెళ్లారు. భూపాలపల్లి పట్టణంలోని అంబేద్కర్ సెంటర్, రేగొండ మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సభల్లో హరీశ్‌బాబు, ధర్మారావుతో పాటు నాయకులు చందుపట్ల సత్యపాల్‌రెడ్డి, ఒంటేరు జయపాల్‌రెడ్డి, వెంకటరమణ, రాజమౌళిగౌడ్, కన్నం యుగదీశ్వర్, పాపయ్య, లింగంపెల్లి ప్రసాదరావు, బట్టు రవి, గణపతి, దొంగల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా వివాహిత మృతి

రేగొండ, ఫిబ్రవరి 29 : మండలంలోని రేపాక గ్రామానికి చెందిన వివాహిత గురువారం అనుమానాస్పదంగా మృతి చెందినట్లు ఎస్సై ఎన్ రవికుమార్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. రేపాకకు చెందిన శిరీష (25)కు ఇదే గ్రామానికి చెందిన మండల శివతో ఐదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. గత కొన్ని రోజుల నుంచి శిరీష అనారోగ్యానికి గురికాగా, ఆర్థిక ఇబ్బందులతో గ్రామంలోనే ఆర్ఎంపీ వద్ద వైద్యం చేయించుకుంటున్నది. గురువారం ఉదయం మృతురాలి తల్లి పల్లెబోయిన శాంతమ్మ కూతురు ఇంటికి వచ్చే సరికి శిరీష మంచంపై పడుకొని ఉంది. ఎంత పిలిచినా లేవకపోవడంతో భయంతో శాంతమ్మ అరుపగా చుట్టు పక్కల వారు వచ్చి శిరీష మృతిచెందినట్లు గుర్